కనువిందు.. నృత్య ప్రదర్శనలు



శిల్పారామంలో అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

మాదాపూర్‌: కళాకారుల కూచిపూడి నృత్యప్రదర్శన సందర్శకులకు కనువిందు చేసింది. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం డాక్టర్‌ వినీల రావు శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు. క్షీర సాగర శయన, జతిస్వరం, జావలి, భోశంభో, నారాయణీయం, మాలధారణం, కనివినిఎరుగని తదితర అంశాలను కళాకారులు శాలిని, ప్రవల్లిక, శ్రీనిధి, సంతోషి, నీరజ, వైష్ణవి, నిత్య, అలేఖ్య, శ్రీచందన ప్రదర్శించారు.

అన్నమయ్యపురంలో..

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం నృత్యార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. పిఠాపురానికి చెందిన శృతిలయ సంగీత కూచిపూడి నాట్యాలయ గురువు ప్రవీణ విశ్వేశ్వర రావు శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. గణేశకౌతం, నారాయణతే నమోనమో, అలరులు కురియగా.. తదితర అంశాలను కళాకారులు కృతి, సంతోషి, కార్తీక, రేష్మ, నళిని, స్వప్నిక, ఆకృతి. చంద్రిక, ప్రవల్లిక, ఉమాదేవి, సింధు తదితరులు ప్రదర్శించారు.



అన్నమయ్యపురంలో..

గురుకులాల్లో వసతులు, నాణ్యమైన విద్య ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



గౌలిదొడ్డి గురుకుల బాలికల కళాశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి రామకృష్ణారావు

రాయదుర్గం/చందానగర్‌: సంక్షేమ గురుకులాల్లో ఆధునిక వసతులు, నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో కొత్త డైట్‌ మెనూను ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్థిక శాఖ కార్యదర్శి రామకృష్ణారావు విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురుకులాలు, సంక్షేమ వసతిగృహాలలో ఉండే విద్యార్థులకు కొత్త మెనూ ప్రకారం భోజనం అందిస్తారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 8 ఏళ్ల తర్వాత డైట్‌ చార్జీలను 40 శాతం పెంచారన్నారు. కార్యక్రమంలో గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి, ప్రిన్సిపల్‌ కల్పన, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గౌలిదొడ్డిలోని ఐఐటీ/నీట్‌ బాలుర కళాశాలలో..

గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల ఐఐటీ/నీట్‌ బాలుర కళాశాలలో నూతన కామన్‌ డైట్‌ మెనూను రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, రంగారెడ్డిజిల్లా డీఆర్‌డీఓ శ్రీలత, ప్రిన్సిపల్‌ వెంకటచలపతి, వైస్‌ ప్రిన్సిపల్‌ గణేష్‌తో కలిసి శనివారం ఆవిష్కరించారు. అనంతరం రాహుల్‌బొజ్జా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన మెనూ డైట్‌ను రూపొందించడం జరిగిందని, దానికి అనుగుణంగా భోజనం అందించాల్సి ఉంటుందన్నారు. డైట్‌ చార్జీలను కూడా ప్రభుత్వం పెంచిందన్నారు. అనంతరం భోజనాన్ని, కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్‌ కమిటీ సభ్యులు, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గోకుల్‌ప్లాట్స్‌లోని టీజీఎంఎస్‌ఆర్‌లో నూతనంగా రూపొందించిన డైట్‌ను ప్రారంభించారు. శ్రీను, ప్రిన్సిపల్‌ చంద్రారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నూతన డైట్‌చార్ట్‌ను ఆవిష్కరిస్తున్న నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ప్రభుత్వం డైట్‌ మెనూ ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని మైనార్టీ రెసిడెన్షియల్‌ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన నూతన డైట్‌ మెనూ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాస్మోటిక్‌, డైట్‌ చార్జీలను పెంచిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని విద్యను అభ్యసించాలని కోరారు. ప్రతి ఏటా ఒక్కో విద్యార్థిపై లక్ష రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజ, పాఠశాల ప్రిన్సిపాల్‌ శోభారాణి, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ విజయ్‌కుమార్‌ పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో హస్తకళా మేళా ప్రారంభం

మాదాపూర్‌: శిల్పారామంలో నేటి నుంచి అంతర్జాతీయ హస్తకళా ప్రదర్శన ప్రారంభం కానుంది. డిసెంబర్‌ 15 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. దాదాపు 450 స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. భారత ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్‌ టెక్స్‌టైల్‌, నేషనల్‌ జ్యూట్‌ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ప్రదర్శనను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావులు ప్రారంభించనున్నారు. ప్రతి రోజు సాయంత్రం ఆంఫీ థియేటర్‌లో 5.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

నేటి నుంచి ఎయిర్‌పోర్టుకు ఏసీ పుష్పక్‌ బస్సులు

మియాపూర్‌: మియాపూర్‌ ఆర్టీసీ డిపో–2 నుంచి శంషాబాద్‌ విమానాశ్రయానికి ప్రతి 50ని.లకు ఏసీ పుష్పక్‌ బస్సులు అందుబాటులోకి వచ్చాయని డిపో మేనేజర్‌ వెంకటేశం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. లింగంపల్లి నుండి చందానగర్‌, మియాపూర్‌ ఆల్విన్‌ ఎక్స్‌రోడ్డు, హఫీజ్‌పేట, కొండాపూర్‌, కొత్తగూడ, గచ్చిబౌలి మీదుగా శంషాబాద్‌ విమానాశ్రయానికి వెళ్తాయని తెలిపారు. లింగంపల్లి–శంషాబాద్‌ 5.45 ని.లకు మొదటి బస్సు, రాత్రి 8.45ని.లకు చివరి బస్సు వెళ్తాయని, అదేవిధంగా విమానాశ్రయం నుండి లింగంపల్లికి మొదటి బస్సు 7.45ని.లకు, చివరి బస్సు రాత్రి 10.30ని.లకు అందుబాటులోఉంటాయని తెలిపారు. లింగంపల్లి, ఆల్విన్‌ ఎక్స్‌రోడ్డు నుండి విమానాశ్రయానికి రూ.300లు, కొండాపూర్‌ , కొత్తగూడ, గచ్చిబౌలి నుండి రూ.250ల చార్జీలు వర్తిస్తాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా దత్త జయంతి వేడుకలు



పూజ చేస్తున్న అర్చకులు, భక్తులు

రాయదుర్గం: అర్చకుల వేదమంత్రోచ్చారణలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య దత్త జయంతిని ఘనంగా నిర్వహించారు. శనివారం టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో కాకడ హారతితో వేడుకలను ప్రారంభించారు. అనంతరం గణపతి, దత్తాత్రేయస్వామి, షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, అలంకారం చేశారు. అనంతరం అర్చకులు వివిఎస్‌ శర్మ ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకులు డి రవీందర్‌రెడ్డి, డి నరేందర్‌రెడ్డి పర్యవేక్షణలో అనఘాదేవి వ్రతం చేశారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం కాలనీలో పల్లకీసేవ, రాత్రి ప్రత్యేక భజన కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

ఉచిత వైద్యశిబిరం



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

చందానగర్‌: కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో మార్తాండ నగర్‌లోని మండల పరిషత్‌ ప్రైమరీ స్కూల్‌లో ఎల్వీ ప్రసాద్‌ ప్రాథమిక కేంద్రం ద్వారా శనివారం 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు దంత, కంటి పరీక్షలు నిర్వహించారు. దాదాపు 200 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. 47 మంది విద్యార్థులకు పంటి సమస్యలను గుర్తించి పళ్లు ఎలా కాపాడుకోవాలో అవగాహన కల్పించారు. శిబిరంలో దంత వైద్యులు అజయ్‌ రావు, ప్రశాంతి, విజయ, 8 మంది టెక్నీషియన్స్‌ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత



మియాపూర్‌: ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి ప్రజలకు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ ఆపన్నహస్తంలా ఆదుకుంటోందని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. మియాపూర్‌ డివిజన్‌ పరిధిలోని నడిగడ్డతండాకు చెందిన వీరేశం వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన సీఎంఆర్‌ఎఫ్‌ రూ.2లక్షల 50వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలి



వార్షికోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, అతిథులు

- హెచ్‌సీయూ సీఎన్‌ఎఫ్‌ డైరెక్టర్‌ డా.సంజయ్‌కుమార్‌శర్మ
- కేంద్రీయ విద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం

రాయదుర్గం: హెచ్‌సీయూ క్యాంపస్‌లోని కేంద్రీయ విద్యాలయలో శనివారం వ్యవస్థాపక దినోత్సవం, వార్షికోత్సవం, వార్షిక క్రీడోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలను హెచ్‌సీయూ సీఎన్‌ఎఫ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ సంజయ్‌కుమార్‌శర్మ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చదువుతో పాటు ఇతర రంగాలపై కూడా ఆసక్తిని పెంచుకోవాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలని విద్యార్థులకు సూచించారు. ఒకేరోజు మూడు కార్యక్రమాలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం పదవీ విరమణ చేసిన నీరజారాణి, భారతి, నీలిమ దేశ్‌పాండే, చంద్రశేఖర్‌లను ఘనంగా సత్కరించారు. అనంతరం అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌ క్రీడాకారుడు కృష్ణసాయికుమార్‌ , ఇన్‌చార్జీ ప్రిన్సిపల్‌ సరిత పూర్ణిమ, ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ టీచర్‌ విజయభాస్కర్‌రెడ్డిలతో కలిసి క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

హెచ్‌సీయూ ప్రొ.గీతకు అరుదైన అవకాశం



రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ ప్రొఫెసర్‌ గీతా వేముగంటికి అరుదైన అవకాశం లభించింది. హెచ్‌సీయూలోని స్కూల్‌ ఆఫ్‌ మెడికల్‌ సైన్సెస్‌ డీన్‌ ప్రొఫెసర్‌ గీతకు 2025–26 మహిళా లీడర్‌షిప్‌ డెవలప్‌మెంట్‌ ప్రోగ్రామ్‌లో మెంటార్‌గా అవకాశం కల్పించారు. సంవత్సరం పాటు సాగే ఇంటెన్సివ్‌ ప్రోగ్రామ్‌. మే 2025 నుంచి మే 2026 వరకు మెంటార్‌గా ఉంటారు. ఈ కార్యక్రమాన్ని అసోసియేషన్‌ ఫర్‌ రీసెర్చ్‌ ఇన్‌ విజన్‌ అండ్‌ ఆప్తమాలజీ (ఏఆర్‌వీఓ) పర్యవేక్షణలో సాగుతుంది. ఏఆర్‌వీఓ ప్రపంచంలోనే అతి పెద్ద కంటి పరిశోధనా సంస్థ. 60 దేశాలకు చెందిన దాదాపు 12వేల మంది పరిశోధకులు సంస్థలో ఉన్నారు. 10 ఏళ్లు మించకుండా అధ్యాపకుల హోదాలో ఉన్న వారు, కనీసం మూడేళ్లపాటు ఏఆర్‌వీఓ సభ్యులుగా ఉన్నవారికి అవకాశం కల్పిస్తారు. ఆమెను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

12 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూ నాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం నిర్వహించిన డ్రైవ్‌లో 12 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 12 మందికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

గవర్నర్‌ను కలిసిన ‘ఎస్కీ’ బృందం



రాజ్‌భవన్‌లో గవర్నర్‌ జిష్ణుదేవ్‌వర్మను కలిసిన ‘ఎస్కీ’ డైరెక్టర్‌ రామేశ్వరరావు, అధికారులు

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌ జిష్ణు దేవ్‌వర్మను గచ్చిబౌలి ఇంజనీరింగ్‌ స్టాఫ్‌ కాలేజ్‌ ఆఫ్‌ఇండియా డైరెక్టర్‌ డాక్టర్‌ జి రామేశ్వరరావు నాయకత్వంలో అధికారులు శనివారం రాజ్‌భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా రామేశ్వరరావు ‘ఎస్కీ’ పనితీరు, ఏడాది పొడవునా నిర్వహించే శిక్షణా కార్యక్రమాలు, స్కూల్‌ ఆఫ్‌ పోస్టుగాడ్యుయేట్‌ స్టడీస్‌లో ఉన్నత విద్యా కోర్సుల నిర్వహణను వివరించారు. ఈ సందర్భంగా ఎస్కీ నోట్‌ను గవర్నర్‌కు అందించారు. ఎస్కీ పనితీరును ఆయన మెచ్చుకున్నారు. అనంతరం జనవరి 3 2025న ఎస్కీలో నిర్వహించే స్నాతకోత్సవానికి రావాలని రామేశ్వరరావు బృందం కోరింది. కార్యక్రమంలో ఎస్కీ చీఫ్‌ ఎస్‌ లక్ష్మీకాంతరావు, పీజీ స్కూల్‌ ప్రిన్సిపల్‌ జగన్‌మోహన్‌రెడ్డి, ఫ్యాకల్టీ రాజు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికత వినియోగంపై వైద్యులు దృష్టి సారించాలి



హెల్త్‌ కేర్‌ సమ్మిట్‌లో పాల్గొన్న ప్రతినిధులు

- డాక్టర్‌ మోహన్స్‌ డయాబెటీస్‌ స్పెషాలిటీస్‌ సెంటర్‌ చైర్మన్‌ డాక్టర్‌. మోహన్‌
- టీహబ్‌లో నాల్గవ హెల్త్‌ కేర్‌ సమ్మిట్‌

రాయదుర్గం: ప్రజల జీవన విధానాన్ని మెరుగుపర్చడానికి వైద్యులు నైపుణ్యం, సాంకేతికతను వినియోగించాలని డాక్టర్‌ మోహన్స్‌ డయాబెటీస్‌ స్పెషాలిటీస్‌ సెంటర్‌ చైర్మన్‌ డాక్టర్‌ వి మోహన్‌ సూచించారు. శనివారం హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో నాల్గవ ఎడిషన్‌ హెల్త్‌ కేర్‌ సమ్మిట్‌–2024 నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో ఎన్నో మార్పులు వచ్చాయని సాంకేతికత వినియోగం పెరిగిందని, వైద్యులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఏఐజీ ఆస్పత్రుల డైరెక్టర్‌ డాక్టర్‌ జీవిరావు మాట్లాడుతూ భారతదేశం వైద్యరంగంలో అనేక పరిశోధనలు సాగిస్తోందన్నారు. అనంతరం దేశ,విదేశాల నుంచి వచ్చిన ప్రతినిధులతో చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రతిభ చాటిన వారికి అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో దేశ, విదేశాలకు చెందిన వైద్యులు, వైద్య నిపుణులు, ఇతర రంగాలకు చెందిన వారు పాల్గొన్నారు.

పర్యావరణంపై చిత్రలేఖనం పోటీలు



మణికొండ: విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై చిన్ననాటి నుంచే అవగాహన పెంచుకోవాలని శరణ్య ఫౌండేషన్‌ ఫౌండర్‌ దివ్య అన్నారు. మణికొండ మండల పరిషత్‌ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై ప్రొజెక్టర్‌ సహాయంతో అవగాహన కల్పించారు. అలాగే పరిసరాల శుభ్రత, మొక్కలు నాటడం, స్వచ్ఛమైన గాలి, నీరు, భూమి గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పర్యావరణంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా దివ్య మాట్లాడుతూ భావితరాలకు మంచి వాతావరణాన్ని అందించేందుకు పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్‌ డైరెక్టర్‌ పూసాల సత్యనారాయణ, ప్రమీల, ఉపాధ్యాయులు అమల, రేణుక, ఫాతిమా, వాలంటీర్లు శృతి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానం.. అంతర్గత రోడ్లు

- రోడ్లను తవ్వి అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ నిర్మాణం
- గుంతలతో రాకపోకలకు ఇబ్బందులు
- అధికారుల సమన్వయ లోపం
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు





ఆల్విన్‌కాలనీ ఫేజ్‌- 1లో రోడ్ల దుస్థితి

ఆల్విన్‌కాలనీ: అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. అడుగుపెట్టలేని స్థితిలో ప్రజలకు ప్రాణసంకటంగా మారాయి. కూకట్‌పల్లి సర్కిల్‌ ఆల్విన్‌కాలనీ ఫేజ్‌ -1లో అంతర్గత రోడ్లను తవ్వి అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ పనులు చేసి నెలలు గడుస్తున్నా రోడ్లు వేయకుండా వదిలేశారు. దీంతో ఆ రహదారులపై రాకపోకలు సాగించలేక ప్రయాణికులు.. నడవలేక స్థానికులు ఇబ్బందులుపడుతున్నారు. అసలే ఇరుకు రోడ్లు.. ఆపై గుంతలతో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించలేక ప్రమాదాల బారినపడి గాయపడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సమన్వయలోపం.. ప్రజలకు శాపం

జీహెచ్‌ఎంసీ అధికారులు, వాటర్‌వర్క్స్‌ అధికారుల సమన్వయలోపంతో పనుల్లో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. వాటర్‌వర్క్స్‌అధికారులు రోడ్లను తవ్వి డ్రైనేజీ నిర్మించి మమ అనిపించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోకపోవటంతో రోడ్లు అధ్వానంగా తయారవుతున్నాయి. డ్రైనేజీ పనులు పూర్తయ్యాక ప్యాచ్‌ వర్కులు లేదా రోడ్లు నిర్మించాల్సి వుంటుంది. ఇరు శాఖల నడుమ సమన్వయం కొరవడడం ప్రజలకు శాపంగా మారింది. ఇప్పటికైనా రోడ్లు వేయాలని ప్రజలు డిమాండ్‌ చేస్తున్నారు.



కూడళ్లు.. సుందరీకరణ



బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌, ఫిలింనగర్‌ ప్రధాన రోడ్ల కూడళ్లతో పాటు కాలనీల కూడళ్లు పచ్చందాలతో చూపరులకు కనువిందు చేస్తున్నాయి. నగర సుందరీకరణ పనుల్లో భాగంగా ఖైరతాబాద్‌ అర్బన్‌ బయో డైవర్సిటీ అధికారులు జంక్షన్లను మరింత అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే బంజారాహిల్స్‌ రోడ్‌నెం.1 జీవీకే జంక్షన్‌తో పాటు రోడ్‌ నెం .1/7, జలమండలి కార్యాలయం జంక్షన్‌, టీవీ9 చౌరస్తా, కేబీఆర్‌ పార్కు చౌరస్తా, జూబ్లీహిల్స్‌ చెక్‌పోస్టు జంక్షన్‌, జూబ్లీహిల్స్‌ రోడ్‌ నెం 92 జంక్షన్‌తో పాటు జర్నలిస్టు కాలనీ జంక్షన్లలో రకరకాల మొక్కలు పెట్టి అందంగా తీర్చిదిద్దారు. దీంతో ఈ దారిగుండా వెళ్తున్న నగరవాసులు ఈ జంక్షన్లను సెల్‌ఫోన్లలో బంధించడంతోపాటు సెల్ఫీలు సైతం తీసుకుంటున్నారు. సర్కిల్‌–18 పరిధిలోని ప్రధాన కూడళ్లతోపాటు కాలనీల్లో ఇప్పటి వరకు 16కు పైగా ప్రాంతాల్లో సుందరీకరణ పనులు చేసినట్లు సర్కిల్‌–18 యూబీడీ మేనేజర్‌ బాలయ్య తెలిపారు. దీనికితోడు జూబ్లీహిల్స్‌ రోడ్‌ నెం. 45లోని ఫ్లైఓవర్‌, పంజగుట్ట ఫ్లై ఓవర్‌ కింద కూడా ఆహ్లాదాన్ని పంచేలా, సరికొత్త అనుభూతిని కలిగించేలా మొక్కలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు రిమాండ్‌

మియాపూర్‌: భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో అతన్ని మియాపూర్‌ పోలీసులు అరెస్ట్‌ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం ఏలూర్‌ జిల్లా లింగంపాలెం మండలం తోచిలుక గ్రామానికి చెందిన ముప్పా మణికంఠ మనోజ్‌(31) అదే జిల్లా చిత్తాపూర్‌కు చెందిన మొక్కపాటి నాగలక్ష్మిని ఆగస్టు 22న వివాహం చేసుకున్నారు. హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. కాగా నాగలక్ష్మిని భర్త మనోజ్‌ శారీరకంగా, మానసికంగా వేధించడంతో ఆత్మహత్య చేసుకుందని.. మనోజ్‌పై చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మనోజ్‌ను అరెస్ట్‌ చేసి విచారించారు.రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

హరిహరక్షేత్రంలో ధనుర్మాసోత్సవాలు

మూసాపేట: భరత్‌నగర్‌ కాలనీలోని హరిహర క్షేత్రంలో సోమవారం నుంచి ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్‌ నాగిరెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 4 నుంచి గోదాదేవి తిరుమంజనం, రోజూ ఉదయం 5 గంటలకు తిరుప్పావై సేవకాలం, జనవరి 4 నుంచి 10 గంటలకు లక్ష తులసి అర్చన, 8వ తేదీ సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపాలంకరణ, 10వ తేదీ ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, 11వ తేదిన కూడారై, 13వ తేదిన గోదా రంగనాథ స్వామి కల్యాణం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ముత్తంగిలో జాతర ప్రారంభం

పటాన్‌చెరు టౌన్‌: పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామంలో శ్రీ గురు దత్తాత్రేయస్వామి జాతర శనివారం ప్రారంభమైంది. ఉత్సవాల్లో భాగంగా గణపతి పూజ, దత్తాత్రేయ స్వామి అభిషేకం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్‌గౌడ్‌, నిర్వాహకులు శ్రీధర్‌గౌడ్‌, శ్రీనివాస్‌రెడ్డి ,శ్రీనివాస్‌ యాదవ్‌, వెంకటేశ్వరరావు, బాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

ఆల్విన్‌కాలనీ: ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని శనివారం వివేకానందనగర్‌ డివిజన్‌ కాంగ్రెస్‌ పార్టీ కంటెస్టెడ్‌ కార్పొరేటర్‌ బాషిపాక నాగమణి యాదగిరి మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ఆల్విన్‌కాలనీ: విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తహసీల్దార్‌ లాల్‌సింగ్‌, ఆర్‌ఐ భానుచందర్‌, కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్‌ స్కూల్‌ బాయ్స్‌1, జూనియర్‌ కాలేజ్‌ క్యాంపస్‌లో శనివారం జరిగిన నూతన కామన్‌ డైట్‌ ప్లాన్‌ ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462